

యస్వీయూ ఆర్ట్స్ కళాశాల మ్యాగజైన్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల 2024 –25 విద్యా సంవత్సరానికి సంబంధించిన "ఆరా ఆఫ్ ఆర్ట్స్ మ్యాగజైన్ " ను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు , ప్రిన్సిపాల్ ఆచార్య సుధారాణి కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో గణనీయమైన చరిత్ర కలిగిన యూనివర్సిటీ ఆర్ట్స్ విభాగం కార్యాలయం ప్రకాశం భవనంలో వుండడం, అలాగే ఆర్ట్స్ కళాశాల పేరు ప్రతిబింబించేలా "ఆరా" పేరుతో ఈ మ్యాగజైన్ తీసుకుని రావడం జరిగిందని, ఈ పదానికి "ప్రకాశించు " అనే అర్థం వస్తుందని అన్నారు. ఈ పుస్తకంలో విద్యార్థుల కవితలు, వ్యాసాలు,వివిధ శాఖల పురోభివద్ధి, జాతీయ, అంతర్జాతీయ సదస్సుల నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల్లో సాధించిన విజయాలు వంటి వాటితో ప్రకాశిస్తుందని, ఇది దాదాపు 200 పైచిలుకు పుటలు కలిగిన డాక్యుమెంటరీ వంటి పుస్తకమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య భాస్కర్ రెడ్డి, పాలకమండలి సభ్యులు ఆచార్య సుమకిరణ్, వార్డెన్ ఆచార్య ప్రయాగ, ఆచార్య రాజేశ్వరమ్మ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె తాత్కాలిక వాయిదా

సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు ప్రకటించిన చెంగయ్య

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్, యంత్రాంగం

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పోరాట ఫలితం ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలను రాష్ట్ర ప్రభుత్వం పాక్షికంగా పెంచింది. ఈ నేపథ్యంలో సమ్మె తాత్కాలికంగా వాయిదా వేసినట్లు యూనియన్ గౌరవాధ్యక్షులు జిబిఎస్ మణ్యం, అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య, ప్రధాన కార్యదర్శి దారా కోటేశ్వరరావు పేర్కొన్నారు. కొన్ని అవకాశవాద సంఘాలు అవలంభించిన సమ్మె విచ్ఛిన్న కార్యక్రమాల మూలంగా జీవో 36ను సాధించుకోలేకపోయారు. వాస్తవానికి జీవో 36 ప్రకారం 21వేల నుంచి 24,500 వరకూ సాధించాల్సి ఉండగా, ప్రభుత్వానికి తొత్తులుగా మారిన కొన్ని సంఘాల వల్ల పాక్షిక విజయం మాత్రమే సాధ్యమయ్యింది. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో నిర్బంధాలను, బెదిరింపులను ఎదుర్కొని పది రోజులుగా సమరశీలంగా పోరాడిన ఇంజినీరింగ్ పారిశుధ్య కార్మికులకు ఫెడరేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. జులై 3న ఇంజినీరింగ్ కార్మికులకు ఏడాది పాటు జీతాలను పెంచలేమని ప్రభుత్వం చెప్పిందని, ఇపుడు పోరాట ఫలితంగా రూ.15వేల నుంచి 18,500 రూపాయలు, 18,500 నుంచి 21,500కు, 21,500 నుంచి 24,500 రూపాయలకు పెంచుతూ జీవో 124 తీసుకొచ్చిందని తెలిపారు. 22వ తేదీ ఉదయం రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణతో క్యాంపు కార్యాలయంలో ఫెడరేషన్ నాయకత్వాన మరోసారి చర్చలు జరిపినట్లు తెలిపారు. ఫెడరేషన్ డిమాండ్లను పరిశీలిస్తామని హామీ ఇచ్చారని, ఆగస్టు 4వ తేదీ వరకూ గడువు ఇచ్చి, పరిష్కరించకపోతే 5వ తేదీ నుంచి రాష్ట్ర కేంద్రం విజయవాడలో రిలేదీక్షలు, నిరవధిక నిరాహారదీక్షలు చేస్తామన్నారు. అప్పటివరకూ సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం యథాప్రకారం సూళ్లూరుపేట, గూడూరు, నాయుడుపేటల్లో సమ్మె కొనసాగింది.

మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

గూడూరులోని నెల్లటూరు గ్రామంలో పారిశుధ్య కార్మికురాలుగా పనిచేస్తున్న గిరిజన మహిళ సంబంధించిన సమస్యపై సోమవారం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించే ప్రయత్నం చేయగా సిఐటియు నాయకుల పట్ల దురుసుగా ప్రవర్తించారని సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. సిఐటియు నాయకుల పట్ల దురుసుగా మాట్లాడిన కమిషనర్‌పై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జోగిశివకుమార్, బివి రమణయ్య, అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య, పుట్టా శంకరయ్య, గండికోట మధు, గుర్రం రమణయ్య, ఎస్.ముత్యాలయ్య, బి.చంద్రయ్య పాల్గొన్నారు.

రామారావును బదిలీ చేయాలని 36వ రోజూ దీక్ష

వెంకటగిరి టౌన్ : నిబంధనలకు విరుద్ధంగా పదేళ్ల నుంచి వెంకటగిరిలోనే తిష్ట వేసి ఉన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష మంగళవారమూ 36వ రోజూ కొనసాగింది. సమ్మెకాలపు ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లిచెంగయ్య మాట్లాడుతూ కమిషనర్ జోక్యం చేసుకుని వెంకటగిరిలో తిష్టవేసి ఉన్న రామారావును బదిలీ చేయాలన్నారు. పారిశుధ్య కార్మికులపైన రామారావు వేధింపులు ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంచలయ్య, ప్రసాద్, సుబ్రమణ్యం, సుభరత్నమ్మ పాల్గొన్నారు.

మునిసిపాలిటీ కార్మికుల నూతన కమిటీ ఏర్పాటు

నాయుడుపేట : మున్సిపల్ ఆఫీసు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించి, అక్కడ మానవహారం నిర్వహించారు. అనంతరం పారిశుధ్య కార్మికులు, ఇంజినీర్ కార్మికుల నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షులుగా వాకాటి నాగరాజు, ఆర్గనైజింగ్ అధ్యక్షులు ముసలిపేటి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కె కాలేషా, కార్యదర్శిగా వీరాస్వామి, ట్రెజరర్‌గా తిరునామల్లి వెంకటేశ్వర్లు, రామచంద్రయ్య, నాన్ ఆప్కాస్ కార్మికులకు అధ్యక్షునిగా దారా రాఘవులు, గౌరవ అధ్యక్షులుగా శివకవి ముకుంద, మున్సిపాలిటీలో మరికొన్ని విభాగాలకు అధ్యక్షులుగా సిహెచ్ ప్రసాద్, వినయ్, వెంకటరత్నం, డి.కృష్ణయ్య, కార్యదర్శులుగా కె.రమేష్, నెలవల సుబ్రమణ్యం, రమణయ్య, మైలారి శ్రీనివాసులు, పోలయ్య, పి.మల్లికార్జున్, సురేష్, దినేస్, ప్రేమ్‌కుమార్ కమిటి సభ్యులుగా ఎంపికయ్యారు.

కమిషనర్ మౌర్యకు అభినందనల వెల్లువ

సర్వేక్షన్-అవార్డు సంతోషదాయకం

మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

దేశవ్యాప్తంగా నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షన్ -2025 అవార్డు తిరుపతికి రావడం ఎంతో సంతోషదాయకమని రెవెన్యూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం కచ్చపి ఆడిటోరియంలో స్వచ్ఛత విజయోత్సవ సభ జరిగింది. కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎంఎల్‌ఎలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మౌర్య, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షితో కలిసి మంత్రి పాల్గొన్నారు. కార్మికులతోనూ, అధికారులతోనూ సమయానికి పని చేయించడం వల్లనే ఇది సాధ్యమయ్యిందని కమిషనర్ ఎన్.మౌర్యను అభినందించారు. శానిటరీ వర్కర్స్ చాలా కష్టపడ్డారని కితాబిచ్చి మెమెంటోలను అందజేశారు.డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, ఆర్‌సి మునికృష్ణ, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ ఛైర్మన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, హస్తకళాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సదాశివం, అడిషనల్ కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్మార్ట్‌సిటీ జిఎం చంద్రమౌళి పాల్గొన్నారు.

నవి ముంబై స్టడీ టూర్‌కు పారిశుధ్య సిబ్బంది

తిరుపతి టౌన్ : నవి ముంబైలో పారిశుధ్య నిర్వహణపై అవగాహన చేసుకునేందుకు తిరుపతి నగరపాలక సంస్థకు చెందిన సుమారు 50 మంది పారిశుధ్య కార్మికులు వెళ్లారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం వెళ్ళారు. మూడు రోజులు పాటు ముంబైలో పారిశుధ్య పనులను పరిశీలించి తిరిగి వస్తారని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ తెలిపారు. అక్కడ తెలుసుకున్నటువంటి అనేక విషయాలను తిరుపతి లో అమలు చేసి నగరాన్ని మరింత సుందరంగా తీర్చి దిద్దేందుకు వీలుంటుంది.

మంత్రి జనార్దన్ రెడ్డికి బొజ్జల ఆతిథ్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మాత్యులు జనార్దన్ రెడ్డి మంగళవారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సాంప్రదాయ స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఊరందూరులోని తన స్వగహంలో మంత్రి దంపతులకు అల్పాహారం విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జనార్దన్ రెడ్డి బొజ్జల కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. మాజీ మంత్రి బొజ్జల గోపాలకష్ణారెడ్డితో తనకున్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. వీడ్కోలు సందర్భంగా పలు రోడ్లు, వంతెనల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మంత్రి దష్టికి తీసుకెళ్లారు. మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

వీధివ్యాపారులకు భద్రత కల్పించాలి

హాకర్లకు గుర్తింపుకార్డులు ఇవ్వాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తోపుడుబండ్ల వ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, 2014 చట్టం ప్రకారం వీధి వ్యాపారులకు రక్షణ కల్పించాలని, పోలీసుల పెటీ కేసులు పూర్తిగా రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి జి.బాలసుబ్రమణ్యం, కందారపు మురళి డిమాండ్ చేశారు. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో తోపుడుబండ్ల వ్యాపారుల నగర ఏడో మహాసభ మంగళవారం జరిగింది. పాత మున్సిపల్ కార్యాలయం నుంచి వేమన విజ్ఞాన కేంద్రం వరకూ ప్రదర్శన నిర్వహించారు. జిల్లా నాయకురాలు పి.బుజ్జి అధ్యక్షతన సభ జరిగింది. నేతలు మాట్లాడుతూ తోపుడుబండ్ల వ్యాపారుల సమస్యలు చాలా తీవ్రంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వాలు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకపోయినా, నీతినిజాయితీగా కష్టపడి, వారి స్వయంశక్తితో వారి శ్రమను నమ్ముకుని జీవనం గడుపుతున్నారన్నారు. మున్సిపాలిటీ నుంచి చట్ట ప్రకారం వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసులు ట్రాఫిక్‌కు ఇబ్బంది పేరుతో అక్రమంగా పిటీ కేసులు బనాయించడం, 550 రూపాయలు జరిమానా వేయడం, కోర్టుకు వెళ్లి రోజంతా పడిగాపులు కాయడం వల్ల రోజంతా కూలి పోగొట్టుకుంటున్నారని అన్నారు.పిటీ కేసులను తక్షణం రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు టి.సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి మాధవ్, సిఐటియు నేతలు కె.వేణుగోపాల్, పి.చిన్నా, బాదుల్లా, వాసు, ప్రజానాట్యమండలి కన్వీనర్ ఎం.రాజు, హాకర్స్ యూనియన్ నాయకులు ప్రసాద్; రామానుజులు, దాము, మురళి, మునిరత్నం, శోభ, మంజుల, వెన్నెల, శ్రీను, రియాజ్, మాధవి, రత్నమ్మ పాల్గొన్నారు.

పురవీధుల్లో వీధి వ్యాపారుల ర్యాలీ

ఎస్వీయూ పరిపాలనా భవనాన్ని ముట్టడించిన విద్యార్థులు

స్వయం ఆన్‌లైన్ కోర్సులు రద్దు చేయాలి

ఎస్వీయూ పరిపాలనా భవనాన్ని ముట్టడించిన ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పీజీ విద్యార్థులపై అధికారులు బలవంతంగా అమలు చేస్తున్న స్వయం ఆన్లైన్ కోర్సులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వందలాదిమంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి తదనంతరం పరిపాలన భవనాన్ని ముట్టడించారు. వీసీ చాంబర్లోకి వెళ్లేందుకు విద్యార్థులు ప్రయంత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పరిపాలన భవనం ముందరే మూడు గంటల పాటు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి మాట్లాడుతూ స్వయం కోర్సుల ముసుగులో కేంద్ర ప్రభుత్వం, విశ్వవిద్యాలయ అధికారులు విద్యార్థులపై అధిక భారాన్ని మోపుతున్నారని, తరగతిగది విద్యను పక్కన పెట్టి ఆన్లైన్ బోధన పేరుతో విద్యను వ్యాపారం చేస్తున్నారని, ఒకొక్క విద్యార్థి దగ్గర ఒక్కో కోర్సుకి 1000 నుంచి 4000 రూపాయలు బలవంతంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. ఆర్ట్స్ కాలేజీకి సంబంధించిన ఆచార్యులు ఈ యొక్క ఆన్లైన్ కోర్సులు వద్దని అధికారులకు విన్నవించినా, వర్సిటీ ఉన్నతాధికారులు మాత్రం ధనార్జనే లక్ష్యంగా చేసుకుని రాష్ట్రంలో మిగతా యూనివర్సిటీల్లో ఎక్కడా లేని విధంగా ఒక్క శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో గత సంవత్సరం నుండి విద్యార్థులపై బలవంతంగా ఈ ఆన్లైన్ కోర్సులు అమలు చేస్తూ, పీజీ పూర్తి కావాలంటే ఈ కోర్సులు తప్పనిసరిగా పూర్తి చేయాలని నిబంధన విధించడం దారుణమని వాపోయారు. ఈ విద్యా సంవత్సరం నుంచె స్వయం కోర్సుని రద్దు చేసి, మునుపటిలాగా ఇతర విభాగాల్లో ఒక సబ్జెక్టుని ఓపెన్ ఎలక్టివ్ పేపర్ గా ఎంచుకునే అవకాశం కల్పించాలని వాళ్ళు కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆఫీస్ బేరర్స్ అశోక్, వినోద్ లు మాట్లాడుతూ వర్సిటీలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులందరు రోజువారీ కూలిపని చేస్కునేవాళ్లని, రోజుకు 200 రూపాయల కంటే తక్కువ ఆదాయం కలవారని, అటువంటి వారిదగ్గర ఆన్లైన్ కోర్సుల పేరుతో డబ్బులు వసూలు చేయడం దారుణమని వాపోయారు. జిఎన్‌ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు శివశంకర్ నాయక్ మద్దతు ఇస్తూ ప్రత్యక్షంగా పోరాటంలో పాల్గొన్నారు. అనంతరం వర్సిటీ ఇంచార్జి వైస్ ఛాన్సర్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయిడు ఛాంబర్ నుంచి నేరుగా విద్యార్థుల దగ్గరకు వచ్చి ప్రిన్సిపాల్స్, డీన్ లతో సమావేశం ఏర్పాటు చేసి స్వయం కోర్సును కచ్చితంగా చేయాలనే నిబంధన వెనక్కి తీసుకుంటాంమని హామీ ఇవ్వడంతో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు తేజ, నరసన్న, గీతాంజలి, తిరుమలేష్, భాను, చక్రి పాల్గొన్నారు.

స్పందించని ఎంఇఒ 2 దయాకర్

ప్రజాశక్తి - ఏర్పేడు

రాష్ట్ర ప్రభుత్వం మోడల్ స్కూలు పేరుతో ఆయా గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 3, 4, 5 తరగతుల విద్యార్థులను బడుల విలీనం అంటూ ఐదు కిలోమీటర్ల లోపు ఉన్న ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ పల్లంపేట గ్రామస్తులు విద్యా సంవత్సరం ఆరంభం నుంచి ఆందోళన చేస్తూనే ఉన్నారు. తమ ఊరి బడిలోనే తాము చదువుకుంటామని ప్రతి సోమవారం పిజిఆర్‌ఎస్‌కు, ఉన్నతాధికారులకు, ఎంఎల్‌ఎకు వినతిపత్రాలు అందజేశారు. బడుల విలీన ప్రక్రియ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూనే ఉన్నారు. అయితే ఉన్నతాధికారులు స్పందించి ఆందోళనలు ఉన్నచోట, విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని విలీనం రద్దు చేస్తామని హామీ ఇచ్చింది. అయితే క్షేత్రస్థాయిలో అమలు చేయకపోవడంతో విద్యార్థులకు హాజరు, మధ్యాహ్న భోజనాన్ని నిలిపేశారు. ఈ విషయమై గ్రామస్తులు ఆందోళన చెందుతూ మంగళవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఏర్పేడు మండల విద్యాశాఖాధికారి 2 దయాకర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు పల్లంపేట, మేర్లపాక విద్యార్థుల గ్రామస్తులు వచ్చారు. విలీనం వద్దని, పిల్లలన ప్రాణాలతో చెలగాటాలాడొద్దని ధర్నా చేపట్టారు. ఎంఇఒ ప్రేమలత మెడికల్ లీవులో ఉండడంతో, ఎంఇఒ 2 దయాకర్‌కు వినతిపత్రం అందజేసే ప్రయత్నం చేశారు. అయితే ఆయన మొహం చాటేసి వెళ్లిపోవడం, ఫోన్ చేసినా తాను వినతిపత్రం తీసుకోనని నిర్మొహమాటంగా చెప్పడంతో 'ఖాళీ కుర్చీకి' వినతిపత్రం అందజేశారు. తమ ఊళ్లోనే పిల్లలకు పాఠశాల కొనసాగించాలని, లేనిచో జిల్లాస్థాయిలో పెద్దఎత్తున ధర్నాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు కె.రంగయ్య, సిఐటియు నాయకులు కరీముల్లా, డివైఎఫ్‌ఐ నాయకులు రాంబాబు, రాజేంద్ర, వెంకటాద్రి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఖాళీకుర్చీకి పల్లంపేట గ్రామస్తుల వినతి

ఎంఇఒ వినతిపత్రం తీసుకోకపోవడంతో ఖాళీకుర్చీకి..

142 కాంట్రాక్టు డ్రైవర్ల క్రమబద్ధీకరణ

- 28 నుంచి విద్యార్థులకు 'సద్గమయ' శిక్షణ
- టిటిడి పాలకమండలి నిర్ణయాలు

ప్రజాశక్తి - తిరుమల

ఎపి హైకోర్టు తీర్పు మేరకు టిటిడిలో 142 కాంట్రాక్టు డ్రైవర్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వానికి సిఫార్సు పంపినట్లు ఛైర్మన్ బిఆర్ నాయుడు వెల్లడించారు.ధర్మకర్తల మండలి సమావేశం అన్నమయ్య భవనంలో మంగళవారం జరిగింది. అనంతరం మీడియాకు పాలకమండలి నిర్ణయాలను ఛైర్మన్ ఈవో జె.శ్యామలరావుతో కలిసి వివరించారు. తిరుమలలో రోజురోజుకూ పెరుగుతన్న శ్రీవారి భక్తుల రద్దీకి అనుగుణంగా భవిష్యత్ అవసరాల దృష్ట్యా వైకుంఠం క్యూకాంప్లెక్స్ -3 నిర్మించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు నిపుణుల కమిటీ వేయాలని నిర్ణయించారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన కార్యక్రమాల బ్రోచర్‌ను టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు ఆవిష్కరించారు. సనాతన ధర్మాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు పలు కార్యక్రమాలను రూపొందించామన్నారు. విద్యార్థులకు మానవీయ, నైతిక విలువలపై శిక్షణ ఇచ్చేలా సద్గమయ కార్యక్రమాన్ని 28న ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. టిటిడి ఆలయాల్లో మహిళలకు గాజులు,పసుపు, కుంకుమ, అక్షింతలు సమర్పించే ప్రత్యేక 'సౌభాగ్యం' కార్యక్రమాన్ని ఆగస్టు 8న ప్రారంభిస్తామన్నారు. అక్టోబర్ 2న మన వారసత్వం, ఆగస్టు 15న సన్మార్గం, 31న హరికథా వైభవం, అక్టోబర్ 2న అక్షర గోవిందం, డిసెంబర్ 1న భగవద్గీతానుష్టానం- బోధన, 2026 వేసవి సెలవుల్లో 16 ఏళ్ల వయస్సు లోపు పిల్లలకు సంప్రదాయ భజనపై భజే శ్రీనివాసం, సంప్రదాయ భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఇఒ వి.వీరబ్రహ్మం, సివిఎస్ఒ మురళీకృష్ణ పాల్గొన్నారు.



నూతన శ్రీవాణి దర్శన టికెట్ల జారీ కేంద్రం ప్రారంభం

శ్రీవారి భక్తులకు మరింత సౌకర్యవంతంగా శ్రీవాణి దర్శన టికెట్లు జారీ చేసేందుకు తిరుమల అన్నమయ్య భవనం ఎదురుగా నూతన శ్రీవాణి దర్శన టికెట్ల కేంద్రాన్ని మంగళవారం ఛైర్మన్ బిఆర్‌న ఆయుడు, ఈవో శ్యామలరావుతో కలిసి ప్రారంభించారు. శ్రీవాణి దర్శన టికెట్ల కోసం భక్తులు ఉదయం 5 గంటల నుంచే క్యూలైన్లలో నిలబడుతున్నారన్నారు. భక్తులకు సులభతరంగా టికెట్లు జారీ చేసేందుకు అత్యాధునిక మౌలిక సదుపాయాలతో రూ.60 లక్షల వ్యయంతో ఈ నూతన కౌంటర్లను నిర్మించినట్లు చెప్పారు. టిటిడి బోర్డు సభ్యులు సుచిత్రెల్లా, జంగా కృష్ణమూర్తి, భానుప్రకాష్‌రెడ్డి, శాంతారామ్, నరేష్, సదాశివరావు పాల్గొన్నారు.

ఆహార నాణ్యత పరీక్ష పరిశోధనశాల ప్రారంభం

తిరుమలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆహార నాణ్యత పరీక్ష పరిశోధనశాలను మంగళవారం టిటిడి ఛైర్మన్ ప్రారంభించారు. గతంలో స్వామివారి ప్రసాదాలు, నెయ్యి లాంటి వస్తువుల నాణ్యత పరీక్షించేందుకు ఇతర రాష్ట్రాలకు నమూనాలు పంపాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం తిరుమలలోనే అత్యాధునిక పరికరాలతో నేరుగా పరీక్షలు నిర్వహించేలా ల్యాబ్‌ను తీర్చిదిద్దినట్లు తెలిపారు. రూ.75 లక్షల విలువైన ఈ పరికరాలను గుజరాత్‌లోని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు విరాళంగా అందించిందని తెలిపారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ధరలు నోటీస్ బోర్డుపై ఉంచాలి

డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్స్, ల్యాబ్స్, డయాగ్నోస్టిక్ సెంటర్లు నిర్వహించే ప్రతి ఒక్కరూ ప్రజలకు తెలిసే విధంగా సేవల రేట్ల వివరాలను నోటీసు బోర్డులలో తప్పక పెట్టాలని డీఎంహెచ్వో బాలాజీ నాయక్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ అల్లోపతిక్ ప్రైవేటు మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్ మెంట్ చట్టం 2002 అపెండిక్స్ రూల్(3) ప్రకారం ప్రతి ప్రైవేటు ఆసుపత్రి లో క్లినిక్స్, డయాగ్నోస్టిక్ సెంటర్స్, ల్యాబ్‌ల నందు ఆ సంస్థ వారు అందించే ప్రతి రకమైన సేవకు వసూలు చేసే రేట్ల వివరాలను స్థానిక, ఆంగ్ల భాషలలో రోగుల ప్రయోజనం కొరకు రిసెప్షన్ కౌంటర్ నందు కనిపించే విధంగా రేట్లు వివరాలు ప్రదర్శించ వలెనని సూచించారు. కనీస సేవల జాబితా ను అనుబంధ సంస్థలకు పంపడం జరిగింది. కావున మేనేజ్మెంట్ వారు వెంటనే వసూలు చేసే రేట్ల వివరాలను వారం రోజుల లోగా డెమోతిరుపతి ఏజిఎమ్ మెయిల్.కామ్ ద్వారా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం కు విధిగా అందజేయాలని కోరారు. వారం లోపు వివరాలను పంపని వారి పై ఆంధ్ర ప్రదేశ్ అల్లో పతిక్ ప్రైవేటు మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్ మెంట్ చట్టం 2002 నవంబర్ 9 ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సేవతోనే సంతృప్తి : సినీ నటి మంచులక్ష్మి

ప్రజాశక్తి - గూడూరు టౌన్

కష్టాల్లో ఉన్న పేదలకు సేవ చేయడం ద్వారా సంతృప్తిని పొందుతామని సినీనటి మంచు లక్ష్మీ అన్నారు. మంగళవారం స్థానిక ఎస్. కే.ఆర్ ప్రభుత్వ కళాశాల సమీపంలో మంచు లక్ష్మీ దాతత్వంతో నిర్మించిన ఇంటిని పరిశీలించి బాధిత కుటుంబసభ్యులతో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎనిమిదేళ్ల క్రితం తాను ఓ టెలివిజన్ ఛానల్లో 'మేముసైతం'కార్యక్రమాన్ని చేపట్టి ఈ కార్యక్రమం ద్వారా పేదల సమస్యలను తెలుసుకుని వారికి సాయం అందించేలా ఓ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఆ సమయంలో గూడూరుకు చెందిన ఉషా అనే మహిళ తన భర్త చనిపోవడంతో కుటుంబాన్ని పోషించుకునేందుకు ఓ ప్రైవేటు కర్మాగారంలో పనులకు వెళుతుండగా, ఆ సమయంలో రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఆమెకు కాలు తీసేశారు. దీంతో ఉషాకు ఆసరాగా నిలిచేందుకు ఆమెకు ఇంటిని నిర్మించేందుకు అవసరమైన ఖర్చులను తానే భరించి నిర్మిం చడం జరిగిందన్నారు. ఎనిమిదేళ్ల తరువాత వారు ఏవిధంగా జీవిస్తున్నారో తెలుసుకునేందుకు నేరుగా వారి వద్దకు వచ్చి వివరాలను అడిగి పరిశీలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రవీంద్రరెడ్డి, గోపాలకష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ క్లాస్‌రూమ్ ప్రారంభం

నాయుడుపేట : నాయుడుపేటతో తమకు ఎనలేని అనుబంధం ఉందని, ఎన్నో ఏళుగా రావాలని అనుకుంటున్నా రాలేకపోయానని సినినటి మంచులక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె నాయుడుపేటలో సందడి చేశారు. రాజగోపాల్‌పురంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం టీచ్ ఫర్ చేంజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్‌రూమును ప్రారంభించారు. ఆంధ్ర, తెలంగాణా రెండు రాష్ట్రాల్లో 320 డిజిటల్ క్లాస్‌రూములను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైస్‌ఛైర్మన్ షేక్ రఫీ, పోలేరమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ నానబాల సుబ్బారావు, అవధానం సుధీర్, బాణాల మునిరత్నం పాల్గొన్నారు.

డిజిటల్ తరగతి గది ప్రారంభించిన మంచులక్ష్మీ

మిథున్ రెడ్డి అరెస్ట్‌పై నిరసన

నిరసన తెలుపుతూ ప్లకార్డులు చూపుతున్న వైసీపీ నాయకులు

ప్రజాశక్తి - బియన్ కండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో సత్యవేడు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ నూకతోటి రాజేష్ అధ్యక్షతన, మండల అధ్యక్షుడు కొణతనేని మణి నాయుడు ఆధ్వర్యంలో వైయస్సార్ విగ్రహం ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నూకతోటి రాజేష్ మాట్లాడుతూ వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిది ముమ్మాటికీ అక్రమ అరెస్టేనన్నారు. లిక్కర్ స్కామ్‌ను సృష్టించి మిథున్ రెడ్డిని అరెస్ట్ చేయడం పిరికిపంద చర్యగా భావి స్తున్నామన్నారు. మండల వైసీపీ అధ్యక్షుడు కొణతనేని మణి నాయుడు మాట్లాడుతూ, ఎవరికైనా అధికారం శాశ్వతం కాదనే విషయం కూటమి నాయకులు గుర్తుపెట్టుకోవాలన్నారు. చర్యకు ప్రతిచర్య ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి ఉగ్గుముడి గురునాథం, రాష్ట్ర గ్రివియన్స్ కార్యదర్శి సాయి నాయుడు, జిల్లా క్రియాశీలక కార్యదర్శి జొన్నల గోపాల్ రెడ్డి, ఆర్‌టిఐ రవి రెడ్డి, దేవదాసు రెడ్డి, జిల్లా క్రియాశీలక అనుబంధ విభాగాలు నాయకులు వైస్ ఎంపిపి బాబు రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మండల సాధారణ సర్వ సభ్య సమావేశం

ప్రజాశక్తి - గూడూరు టౌన్: బుధవారం గూడూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వ సభ సమావేశం నిర్వహిస్తున్నట్లు గూడూరు ఎంపిడిఓ మధుసూదన్ రావు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సమావేశంలో మండల ప్రజా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, జిల్లా ప్రాదేశిక వర్గ సభ్యులు అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: అనారోగ్యంతో బాధపడుతూ, సీఎం రిలీఫ్ ఫండ్‌కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం నుండి వచ్చిన చెక్కులను ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పంపిణీ చేశారు. నగరి మున్సిపాలిటీ ఏకాంబర కుప్పంకు చెందిన దేవికకు రు. 36,228, నగరి పేటకు చెందిన గోపికు రు.54,046, నగరి టౌన్‌కు చెందిన అహ్మద్ బాషాకు రు.65,713, నగరి రూరల్ మండలం రామాపురం గ్రామానికి చెందిన బుజ్జికి రు. 1,14,574, వీఎన్ఆర్ పేటకు చెందిన మయూరికి రు.96, 728, నింద్ర మండలం, కావనూరు దళిత వాడకు చెందిన నాగరాజుకు రు.1,59,646, అగరంపేటకు చెందిన బాలసుబ్రమణ్యం శెట్టికి రు. 69,141, వడమాలపేట మండలం, అప్పలాయగుంట, వడ్డిపల్లికి చెందిన చంద్రయ్యకు రు.30000 లు మొత్తం 8 మందికి రు. 6,26,077 పంపిణీ చేశారు.

హార్టికల్చర్‌తో రైతులకు లబ్ది

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండల పరిధిలోని జమీన్ కొత్తపాలెంలో మహాత్మా గాంధీ ఉపాధి పథకం ద్వారా పొలాల్లో మామిడి చెట్లను నాటారు. ఈ పథకం ద్వారా రైతులకు ఎంతో లబ్ది చేకూరుతుందని రైతు కందుకూరి విశ్వనాథ్ తెలిపారు. రైతులకు మరింత సౌకర్యాలతో దానిమ్మ, చీని వంటి పండ్ల సాగును అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రతి ఒక రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఫీల్డ్ అసిస్టెంట్ అంకయ్య, ఉపాధి కార్మికులు పాల్గొన్నారు.

విద్యాభ్యాసానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్వీ రత్నం చారిటబుల్ ట్రస్ట్ అధినేత శ్రీకంఠి రామ్మోహనరావు దాతృత్వంతో వివిధ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు స్కూల్ ఫీజు, బుక్స్ కోసం 1లక్ష 49వేల రూపాయలను వారి కార్యాలయంలో విద్యార్థుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ వెస్ట్ క్లబ్ అధ్యక్షులు దువ్వూరు విజయ్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఎస్వీ రత్నం చారిటబుల్ ట్రస్ట్ అధినేత శ్రీకంఠి రామ్మోహనరావు దాతృత్వంతో ప్రతి సంవత్సరంపేద విద్యార్థుల ఫీజులు, బుక్స్ కోసం 1.లక్ష 49.వేల రూపాయలను అందజేయడం అభినందనీయమన్నారు. క్లబ్ ద్వారా నిరంతరం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కందాటి రాఘవరెడ్డి, రొటేరియన్స్ ఎల్లసిరి గోపాల్ రెడ్డి, నాసిన నాగులు, చోళవరం గిరిబాబు, కే.సనత్ కుమార్ రెడ్డి, బండి ధనుంజయ రెడ్డి, పి.హరినాద్ రెడ్డి, ఐ.లక్ష్మీనారాయణ, వాసు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్ట్‌తో సేంద్రియ ఎరువులు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: వర్మీ కంపోస్ట్ గుంతలను ఉపాధి హామీ పథకం ద్వారా తువ్వుకుని రైతులు ప్రయోజనాలు పొందాలని డ్వామా పథక సంచాలకులు శ్రీనివాస ప్రసాద్ సూచించారు. మంగళవారం బుచ్చినాయుడు కండ్రిగ మండలం, కాటూరు పంచాయతీలోని వల్లి సాహెబ్ ఇంటి వద్ద వర్మీ కంపోస్ట్ పిట్‌ను ఆయన పరిశీలించారు. ప్రతీ ఇంటి వద్ద వర్మీ కంపోస్ట్ పిట్‌లు తవ్వుకోవాలని, తద్వారా సేంద్రియ ఎరువును తయారు చేసుకోవచ్చని తెలిపారు. దీంతో రసాయన రహిత సేంద్రియ ఎరువును పంటలకు వినియోగించి స్వచ్ఛమైన దిగుబడి పొందవచ్చన్నారు. రైతులకు పెట్టుబడి కూడా తగ్గుతుందని తెలిపారు. అనంతరం ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కార్యక్రమాధికారి అవిలాల దేవరి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ భానుశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ ఏకాంబరం, ఉపాధి హామీ శ్రామికులు తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: సమాచార హక్కు చట్టం ప్రజల చేతుల్లో పాశుపతాస్త్రం వంటిదని డాక్టర్ చంద్రమౌళి పేర్కొన్నారు. మంగళవారం పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. చంద్రమౌళి మాట్లాడుతూ ప్రభుత్వ పాలనలో పారదర్శకతను పెంచడానికి, అవినీతి నియంత్రణకు సమాచార హక్కు చట్టం వచ్చిందని తెలిపారు. రాబోయే నాలుగు రోజుల్లో సమాచార హక్కు చట్టం గురించి వివిధ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కోటేశ్వరయ్య, డాక్టర్ నరసింహులు పాల్గొన్నారు.

పులివర్తి లక్ష్మీ భారతికి మంత్రి అనగాని, ఎమ్మెల్యే బొజ్జల నివాళి

ప్రజాశక్తి - రామచంద్రపురం(పాకాల) రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మంగళవారం పాకాల మండలం, అదేనపల్లి పంచాయతీ పరిధిలోని పులివర్తివారిపల్లెకి చేరుకుని, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాతృమూర్తి, దివంగత పులివర్తి లక్ష్మీ భారతికి నివాళులర్పించారు. అనంతరం, పులివర్తి నాని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బుట్ట భోజనం రుచి మరువకుంటివినే..!

కమ్మని విందుకు కేరాఫ్ సుబ్బయ్య గారి హోటల్ @ 2 సం.

ప్రజాశక్తి తిరుపతి సిటీ: ఏడు దశాబ్దాల చరిత్ర గల సుబ్బయ్య హోటల్ ఇప్పుడు తిరుపతిలో అడుగు పెట్టి రెండేళ్లు పూర్తి చేసుకుంది. కాకినాడ వెళ్తే తప్పకుండా సుబ్బయ్యగారి హోటల్ లో భోజనం చేయాలని చెబుతారు. సుమారు ఆరు దశాబ్దాలుగా ఆహార ప్రియుల అభిమానం చూరగొన్న ఈ హోటల్ హైదరాబాద్ లోనూ అడుగుపెట్టింది. మే 28న అమీర్‌పేటలో కొత్త శాఖను ప్రారంభించింది. ఇంతకు ముందే కూకట్పల్లి, మలక్‌పేట, కొండాపూర్లో శాఖలను ఏర్పాటు చేసింది.

మరి.. ఈ హోటల్ ప్రత్యేకతలు ఏమిటో తెలుసుకుందామా!

సుబ్బయ్యగారి హోటల్‌కు దాదాపు 60 ఏళ్ల ఘన చరిత్ర ఉంది. ప్రకాశం జిల్లా నుంచి కాకినాడకు వలస వచ్చిన సుబ్బయ్య 1950లో పది మందితో కలసి కాకినాడలో చిన్న మెస్ ఏర్పాటు చేశారు. అప్పట్లో ప్లేటు భోజనం కేవలం 50 పైసలకు విక్రయించేవారు. 1955లో ఈ మెస్ ను "శ్రీకష్ణ విలాస్' పేరుతో హోటల్ మార్చారు. ఉభయ గోదావరి జిల్లాలోనే ఫేమస్ శాఖాహార హోటల్‌గా పేరొందిన ఈ హోటల్ హైదరాబాద్లో అడుగు పెట్టిన కొద్ది రోజుల్లోనే ఆహార ప్రియుల మనసు దోచుకుంది. ఈ హోటల్ ఏర్పాటు చేసిన సుబ్బారావు కస్టమర్లను ఎంతో మర్యాదపూర్వకంగా ఆహ్వానిస్తూ కడుపు నిండా భోజనం పెట్టేవారు. దీంతో కస్టమర్లు ఆ హోటల్‌ను "సుబ్బయ్య హోటల్' అని పిలిచేందుకే ఇష్టపడేవారు. చివరికి ఆ పేరే బ్రాండ్‌గా మారి, 'సుబ్బయ్యగారి హోటల్‌గా ఆహార ప్రియుల మనసు దోచుకుంటోంది.

ఒక్కో ప్రాంతానికి ఒక్కోరుచి..

హైదరాబాద్‌లో తొలి శాఖను కూకట్పల్లి, కేపీహెచ్ బీ కాలనీ, రోడ్ నెం. 4లో ప్రారంభించారు. ఈ హోటల్ ఆంధ్ర వంటకాలకు పెట్టింది పేరు. ముఖ్యంగా పునుకుల కూర భలే రుచిగా ఉంటుంది. అలాగే ఇక్కడ బుట్ట భోజనం భలే ఫేమస్. రూ.315 పెట్టి బుట్ట భోజనం కొనుగోలు చేస్తే ముగ్గురికి సరిపోతుంది ఇందులో 12 రకాల వంటకాలను ఇస్తారు. ఇక్కడికి వెళ్లే కస్టమర్లను సిబ్బంది మర్యాదపూర్వకంగా ఆహ్వానిస్తారు. రాగి గ్లాసుల్లో మంచి నీళ్ల ఇస్తారు. అరటి ఆకుల్లో వివిధ రకాల స్వీట్లు, పులిహోర, పుదీనా రైస్, వెజ్ బిర్యానీ వంటివి వడ్డిస్తారు. బూరెల్లో నెయి వేసి మరీ ఇస్తారు. మీకు ఓపిక ఉండాలేగానీ... 30 రకాల వంటకాలను ఒకేసారి రుచిచూడొచ్చు. చివర్లో తాగేందుకు చల్లని మజ్జిగా, కిళ్లీ ఇస్తారు. తిరుపతి సుబ్బయ్య హోటల్ ధరల ప్రకారం, ఫుల్ మీల్స్ రూ.289, ఇందులో 30 రకాల వంటకాలను వడ్డిస్తారు. సింగిల్ మీల్స్ 8 రకాలు. బుట్టభోజనం 15 రకాలు జీడిపప్పు బూర్, బిర్యానీ, పులిహోర, ముంత పెరుగు, బెల్లం గారెలు, గుత్తి వంకాయ, దొండకాయ, నేతి బూరెలతో పాటు సుమారు వివిధ రకాల గోదావరి రుచులను ఒకేసారి ఆస్వాదిస్తూ తినొచ్చు. పార్శిల్ రూ.399, నేడు తిరుపతిలో కూడా ఈ శాఖను ఏర్పాటు చేసి 2 సంవత్సరాలు పూర్తవుతుందని ఆ హోటల్ తిరుపతిశాఖ మేనేజరు కృష్ణ ప్రజాశక్తికి తెలిపారు. రెస్టారెంట్, స్వీట్స్, బ్యాంకెట్ హాల్, ప్రీవియమ్ రూమ్స్‌తో తిరుపతిలోని పద్మావతిపురంలో ఏర్పాటు చేసిన సుబ్బయ్యగారి హోటల్ అనతి కాలంలోనే అందరి మన్ననలను పొందింది. దేశ



నలుమూలల నుంచి, విదేశాల నుంచి సైతం యాత్రికులు తిరుపతికి వస్తుంటారు. శ్రీవారి దర్శనార్థం అనేక ప్రాంతాలు, బాషలు, భిన్నమైన భౌగోళిక అంశాలతో కూడిన ప్రాంతవాసులు వస్తుంటారు. వారందరి అభిరుచులకు తగ్గట్టు నాణ్యమైన, శుభ్రమైన తాజా శాఖహార పదార్థాలను రుచికరంగా అందిస్తున్నామన్నారు. దీన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒకరు సుబ్బయ్యగారి హోటల్‌కు విచ్చేసి, తమ రుచులను ఆస్వాదించాలని కోరారు. వివరాలకు 95126608 నెంబరును సంప్రదించాలని కోరారు.

సుపరిపాలనలో తొలి అడుగు

కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - రేణిగుంట: శ్రీ కాళహస్తి నియోజకవర్గం, రేణిగుంటలో మంగళవారం తిరుపతి జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, మండలాధ్యక్షుడు చంద్ర రెడ్డి, పుష్ప నాదం, మునస్వామి నాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆదేశాల మేరకు, పుత్తూరు రూరల్ క్లస్టర్ ఇంచార్జ్ గంజి మాధవయ్య ఆధ్వర్యంలో పుత్తూరు రూరల్ మండలం, నేషనూరు గ్రామపంచాయతీ, కళ్యాణ వెంకటేశ్వరపురం, తొర్రూరు పంచాయతీ, పైడిపల్లి గ్రామాల్లో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఏడాది కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్చార్జ్ బాలకృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు భాస్కర్ నాయుడు, జెసిబి చిన్నా, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు దిశా నిర్దేశం

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెలుగు ప్రవాసులు, అధిక సంపన్న వ్యక్తుల సహకారంతో పేదరికం లేని సమాజాన్ని సాధించడానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సూచనల మేరకు వాకాడు మండలంలో 1979 మంది నిరుపేదలను గుర్తించడం జరిగిందన్నారు. వారిలో 1548 మందిని దత్తత కార్యక్రమం తీసుకోవాలని టార్గెట్ ఇవ్వడం జరిగిందని కావున పంచాయతీ కార్యదర్శులు దీన్ని ఒక లక్ష్యంగా పెట్టుకుని, మండల పరిధిలో ఉన్నత కుటుంబాలు, ఎన్నారైలు, భూస్వాములని గుర్తించి వారికి ఈ మహత్తర కార్యక్రమం గురించి వివరించాలని సూచించారు. ఆగస్టు మొదటి వారంలోగా ఈ టార్గెట్ పూర్తి చేసి ఆదర్శవంతమైన మండలంగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాకాడు మండలం తహశీల్దార్ ఎస్.రామయ్య, ఎం.ఈ.ఓ నజీమ్ అలీ, ఏ.పీ.ఓ విజయ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికే 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - గూడూరు టౌన్: రైతుల సమస్యలు పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తోందని గూడూరు మండల వ్యవసాయాధికారి రమేష్ స్పష్టం చేశారు. మంగళవారం గూడూరు మండల పరిధిలోని రామలింగాపురం, మిట్టాత్మకూరు గ్రామాలలో రైతులతో కలిసి పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటకి అవసరమైన మేరకే రసాయన ఎరువులు, పురుగు మందులు వాడాలని, అధిక రసాయనాలతో భూమి కలుషితమై నిస్సారమవుతుందని హెచ్చరించారు. ఖరీఫ్ 2025 కి సంబంధించి పంట నమోదు చేయడం జరుగుతుందని, ప్రతి రైతు మీరు సాగు చేసే పంట వివరాలను రైతు సేవా కేంద్రం సిబ్బందికి తెలిపి పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామలింగాపురం, మిట్టాత్మకూరు గ్రామ వ్యవసాయ సహాయకులు కళ్యాణి, శివ శంకర్, రైతులు పాల్గొన్నారు.

అచ్యుతానంద ఆశయ సాధనకు కృషి చేద్దాం

ప్రజాశక్తి - రామచంద్రపురం (పాకాల) సమాజంలో కుల వివక్షత నిర్మూలనకు పోరాటం చేసిన యోధుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానంద మృతి సమాజానికి తీరని లోటని సిపిఎం మండల కార్యదర్శి మధుసూదన్ రావు పేర్కొన్నారు. మంగళవారం పాకాల, బాలాజీ ఆటో స్టాండ్ ఆవరణలో సిపిఎం, సిఐటియు, కెవిపిఎస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అచ్చుతానంద మృతికి సంతాప సభ నిర్వహించారు. అచ్చుతానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మదన్మోహన్ మాట్లాడుతూ సిపిఎం పార్టీ ఉద్యమాలకు ఊపిరి పోసిన గొప్ప వ్యక్తి అచ్యుతానందని కొనియాడారు. అచ్చుతానంద ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ అధ్యక్షుడు నరేంద్ర, రత్నం, సిఐటియు అధ్యక్షుడు ఆనంద్, రాజు, శేఖర్, మణి, మస్తాన్, వెంకటరమణ, గోవింద్ రెడ్డి, గోపాల్ రెడ్డి, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

అచ్యుతానందన్‌కు అశ్రునివాళి

పుత్తూరు టౌన్: పట్టణంలోని ఆటోస్టాండ్ వద్ద కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ మృతికి సిపిఎం ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. సిపిఎం జిల్లా కమిటి సభ్యులు ఎస్.జయచంద్ర, వెంకటేష్ మాట్లాడుతూ కేరళలో పేద కుటుంబంలో పుట్టి, కార్మిక కర్షక పేదల కోసం అనేక పోరాటాలు చేసి, తొమ్మిదిసార్లు సిపిఎం ఎంఎల్ఏగా గెలుపొందారన్నారు. అసెంబ్లీలో ప్రజల కోసం పోరాడారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎ.విజయ్, ఎ.శివ, రమేష్,కృష్ణమూర్తి, కుమార్, రవి, ప్రవీణ్‌కుమార్, రామలింగం పాల్గొన్నారు.

- రేణిగుంటలో సీనియర్ నాయకులు ఒ.వెంకటరమణ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. అచ్యుతానందన్ తుదిశ్వాస విడిచేంత వరకూ కమ్యూనిస్టు ఉద్యమానికి తమ జీవితాన్ని అంకితం చేశారన్నారు. 1923లో జన్మించిన అచ్యుతానందన్ చిన్న వయస్సులోనే తల్లిదండ్రులను కోల్పోయారని, ఏడో తరగతి వరకూ చదివి, కేరళ రైతుల కోసం తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. ఎమర్జెన్సీ సమయంలో 19 నెలలు జైల్లో గడిపారన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు తులసీరాజన్ మాట్లాడుతూ అచ్యుతానందన్ అవినీతి వ్యతిరేక యోధుడుని కొనియాడారు. నాయకులు కుప్పస్వామి, ఎంపిటిసి రాజేశ్వరి, రాజశేఖర్, దిలీప్‌బాష, ఈశ్వరి, మల్లీశ్వరి, భారతి పాల్గొన్నారు.

మైనార్టీల అభ్యున్నతికి టిడిపి పెద్దపీట

మైనార్టీ కార్పొరేషన్ అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్‌ను సన్మానిస్తున్న మైనారిటీ నాయకులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: మైనార్టీల అభ్యున్నతికి టిడిపి ప్రభుత్వం పెద్దపీటం వేస్తోందని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ టిడిపి రాష్ట్ర మైనార్టీ విభాగ అధ్యక్షులు మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర మైనారిటీ విభాగం అధ్యక్షులు మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ తిరుపతికి విచ్చేసి మైనారిటీల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న మైనారిటీ సంక్షేమ పథకాలను ఈ సమావేశంలో వివరించారు. రాష్ట్ర మైనారిటీ విభాగ ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ మహబూబ్ బాషా సంక్షేమ పథకాలు అందుబాటులోకి ఎలా తీసుకురావాలో తెలియచేశారు. ఈ సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు మైనారిటీ విభాగం రఫీ, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి షాకీర్ అలీ, టీడీపీ రాజంపేట పార్లమెంట్ మైనారిటీ విభాగం అధ్యక్షులు షబానా కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి నా బాధ్యత : ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి - రామచంద్రపురం(పాకాల): ఎమ్మెల్యే పులివర్తి నాని, తల్లిని కోల్పోయి తీవ్ర దుఃఖంలో ఉన్నప్పటికీ, నియోజకవర్గ అభివృద్ధి పట్ల తన నిబద్ధతను చాటుకున్నారు. తల్లి మరణం వ్యక్తిగతమని, నియోజకవర్గ అభివృద్ధి నా బాధ్యతని అన్నారు. మంగళవారం పాకాల మండలం పులివర్తివారిపల్లి స్వగృహంలో యర్రావారిపాల్యం మండల టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి కర్మకాండలు పూర్తయ్యేంతవరకు సంప్రదాయబద్ధంగా బయటకు వెళ్లకూడదనే ఆచారానికి కట్టుబడి, నియోజకవర్గ బాధ్యతలను నిర్లక్ష్యం చేయకుండా ప్రత్యేక దృష్టి పెడుతున్నాని తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రతి ఒక్కరూ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మండల, గ్రామ కమిటీ, క్లస్టర్, యూనిట్ ఇన్చార్జులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను అడ్డుకోండి : వామపక్షాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: గత ప్రభుత్వం లో చేదైన స్మార్ట్ మీటర్లు..నేడు తీపెలా అయ్యాయో కూటమి నేతలు చెప్పాలని వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సామాన్యులకు షాక్ ఇచ్చి, అదానీకి మేలు చేకూర్చే స్మార్ట్ మీటర్లను ఎక్కడికక్కడ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం వామపక్ష, ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆగస్టు 5న వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలో ప్రజలంతా పాల్గొనాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య కోరారు. స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలంటూ యువగళం పాదయాత్రలో చెప్పిన లోకేష్ ఇప్పుడు నోరుమెదపకపోవడం ప్రజల్ని మోసం చేయడమేనని అన్నారు. ట్రూ అప్ చార్జీలు అదనపు చార్జీలు, స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని ప్రజలకు ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ పట్టణ కార్యదర్శి రొడ్డా గోపి, సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, అన్వర్ బాషా, లాల్ బాషా, కుమార్, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు ఎస్ఎం షరీఫ్, జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పులి శ్రీకాంత్, ఎస్డీకే నగర్ పరిరక్షణ కమిటీ సభ్యులు గోవిందయ్య, రామకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అందిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, నగరంలో నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేస్తే చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళవారం మధురానగర్‌లోని డ్రైనేజీ కాల్వలను, రోడ్లను అధికారులతో కలిసి పరిశీలించారు. మధురానగర్‌లో ఎప్పటికప్పుడు డ్రైనేజీ కాల్వల్లో చెత్తను తొలగించి, నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. రోడ్లపై గుంతలు లేకుండా చూడాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ట్రైనీ కలెక్టర్ రఘువంశీ, అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్ గోమతి పాల్గొన్నారు.

యస్వీయు స్నాతకోత్సవం నిర్వహించండి

ప్రజాశక్తి - క్యాంపస్: యస్వీయు స్నాతకోత్సవం నిర్వహించాలని గిరిజన నవ సమాజ్ ఆధ్వర్యంలో ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య అప్పారావుకు, రిజిస్ట్రార్ భూపతినాయుడును కలిసి వినతిపత్రం ఇచ్చారు. 2022లో 62వ కాన్వకేషన్ నిర్వహించారని, గడిచిన రెండేళ్లలో నోటిఫికేషన్ విడుదల చేయలేదన్నారు. డిగ్రీ, పీజీ పూర్తి చేసిన పేద విద్యార్థులు ఇన్ అడ్వాన్స్ ఫీజులు కట్టలేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఉద్యోగాల ఇంటర్వ్యూలకు వెళ్లేవారికి కనీసం ఆరం పదిరోజులైనా సర్టిఫికెట్ల కోసం తిరగాల్సి వస్తోందని వాపోయారు. పాలిత్య శివశంకర్‌నాయక్, చంద్రశేఖర్ నాయక్, సురేంద్ర పాల్గొన్నారు.

ఈబీసీ కాలనీలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్య క్రమంలో భాగంగా మంగళవారం బిఎన్ కండ్రిగ మండలం బిఎన్ కండ్రిగ ఈబీసీ కాలనీలో వైసీపీ సత్యవేడు ఇంచార్జ్ నూకతోటి రాజేష్, మండ ల అధ్యక్షుడు మణి నాయుడు, సర్పంచ్ బూదూరు వెంకటమ్మ, వైసీపీ నాయుకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు హామీలు మరచి ఎలా మోసం చేసారో వివరించారు.

BEFORE THE HON'BLE SUBORDINATE COURT AT TIRUTTANI
I.A.No.1 of 2022.
in
H.M.O.P.No. 93 of 2019.
J. Harikrishnan ....Petitioner/Petitioner
-Vs-
Dasari Supriya @ Supriya@ Priya ....Respondent/Respondent.
To,
Dasari Supriya @ Supriya@ Priya,
W/o. J.Harikrishnan, D/o.D.Subramaniyam,
4-60/1, K.B.R.Puram Village,
Puttur Mandalam,Chittoor District,
Andhra Pradesh.
Take notice that the above case pending on the file of the Hon'ble Sub-Court, Tiruttani is came up for hearing on 25-06-2025 and the Hon'ble Court ordered notice to you and posted the above matter on 08-08-2025 and thereby make your presence either in person or through the pleader without fail on 08-08-2025 before the Hon'ble Sub-Court, Tiruttani at 10.30AM, failing which the matter will be decided in your absence.
N. MOHAN
Counsel for Petitioner/Petitioner
Tiruttani, Tamilnadu
Cell No.9677369007.

క్రైం న్యూస్

శేషాచలం అడవుల్లో ముగ్గురు వ్యక్తుల అరెస్ట్
పిడి లేని మూడు గొడ్డళ్ల స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి, కాజీపేట అడవులలోకి అక్రమ పద్ధతిలో ప్రవేశిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి పిడిలేని మూడు గొడ్డళ్లు, రంపాలు, వంట సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఎస్ఐ ఎం.మురళీధర్ రెడ్డి బృందం సోమవారం ప్రొద్దుటూరు రేంజ్‌లోని కాజీపేట సెక్షన్ మీదుగా కన్నెలవాగు చేరుకోగా అక్కడ ఓ కారు నుండి కొంతమంది వ్యక్తులు దిగుతున్నారని, వారి వద్దకువెళ్తుండగా వారు పారిపోవడానికి ప్రయత్నం చేశారన్నారు. పట్టుబడ్డ ముగ్గురు వ్యక్తులు తమిళనాడుకు చెందినవారుగా గుర్తించామన్నారు. వారు వినియోగించిన కారును కూడా సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్ సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారన్నారు. ఈ ఆపరేషన్‌లో డీఎస్పీలో శ్రీనివాసరెడ్డి, షరీఫ్, ఏ సి ఎఫ్ జె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం.. ఒకరి అరెస్ట్

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం), తిరుపతి సిటీ: తిరుపతి రూరల్ ఎక్సైజ్ సీఐ నరసానా యుడు, ఇఎస్టిఎఫ్ సిఐ శ్యాం ప్రసాద్ సం యుక్తంగా తిరుపతి రూరల్ పరిధిలోని తనపల్లి ఇందిరమ్మ ఇండ్లు బ్లాక్ నెంబర్ 68లో దాడులు జరిపి 650 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, కుట్టి సతీష్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి నాగమల్లేశ్వర్ రెడ్డి, ఏఈఎస్ వాసుదేవ చౌదరి ఆదేశాలతో గంజాయి స్థావరాలు, విక్రయాలపై ముమ్మర తనిఖీలు చేస్తున్నామని అధికారులు తెలిపారు. కుట్టి సతీష్‌కు ఈనెల ఒకటో తేదీన గంజాయిని సరఫరా చేసిన భాక్యరాజ్ అనే వ్యక్తిపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ ఇద్దరు వ్యక్తులపై పాత కేసులు ఉన్నాయని, కుట్టి సతీష్‌పై 2023 సంవత్సరంలో చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో, బాక్యరాజ్ పై(15) రోజుల క్రితం తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో గంజాయి కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సైలు స్వామి నాథన్, కవిశ్వరనాయుడు, హెడ్ కానిస్టేబుళ్లు మంజునాథ నాయుడు, రమేష్, కానిస్టేబుళ్ళు వేణుగోపాల్, మునిరెడ్డి, డేవిడ్, రూప్ కుమార్‌లు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌కు గురై మహిళ మృతి

పార్వతమ్మ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - తొట్టంబేడు: మండలంలోని పొయ్యి పంచాయతీ హరిజనవాడలో మంగళవారం కుక్క పార్వతమ్మ(50) అనే మహిళ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. తొట్టంబేడు మండలం పోలీస్ స్టేషన్ అధికారులు తెలిపిన వివరాల మేరకు పార్వతమ్మ తన ఇంటిలోని దుస్తులను ఉతికి ఎదురింటి వాకిట్లో ఉన్న కమ్మి మీద ఆరబెడు తుండగా ఆ కమ్మిలో అప్పటికే విద్యుత్ సరఫరా ఉండటంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే ఆమె కుప్పకూలిపోయింది. వెంటనే ఆమె కుమారుడు ఆమెను శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తీసుకొని పోగా అక్కడి వైద్యులు పరిశీలించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధృవీకరించారు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులకు అప్పగించామని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సైబర్ వలలో అడ్వకేట్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: సైబర్ నేరగాళ్లు ఓ అడ్వకేటును బురిడీ కొట్టించి, అతని అకౌంట్ నుంచి 3,50,000 రూపాయలను దోచేసిన ఘటన వెలుగు చూసింది. ఎంఆర్ పల్లి సిఐ చిన్న గోవిందు తెలిపిన వివరాల మేరకు పేరూరు పంచాయతీ విద్యానగర్ కాలనీకి చెందిన అడ్వకేట్ తన ఫోన్ నెంబర్ నుండి ఏపీకే అప్లికేషన్ రావడంతో, అప్లికేషన్ ఓపెన్ చేయగానే 3 అకౌంట్లకు సంబంధించిన నగదు వేరే ఇతర 8 అకౌంట్లలోకి బదిలీ అయింది. మోసపోయానని తెలుసుకున్న అడ్వకేట్ సైబర్ హెల్ప్ డెస్క్1930కు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

యువకుడు ఆత్మహత్య

అశోక్ కుమార్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు తిరుపతి రూరల్, సాయి నగర్ నివాసి ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే రామసముద్రం అశోక్ కుమార్ (23) ఆన్లైన్ గేమ్‌లకు వ్యసనపరుడై అధిక అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తిచెంది ఇంటిలోనే ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా హాస్పిటల్‌కి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులుగా జయ కుమార్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నగర నాయి బ్రాహ్మణ సేవా సంఘం నూతన అధ్యక్షులుగా జయ కుమార్ గెలుపొందారు. తిరుపతిలో మొట్టమొదటి సారిగా బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ జరిగింది. ఎన్నికల అధికారులుగా జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు సురేంద్ర, సీనియర్ జర్నలిస్టు ద్వారక, నగర నాయి బ్రాహ్మణ సేవా సంఘం గౌరవాధ్యక్షులు రామనారాయణ లు వ్యవహరించారు. ఈ ఎన్నికల నిర్వహణలో ఆవులపాటి బుజ్జిబాబు, క్షవర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంగులప్ప, ఇనుగొండ లక్ష్మణరావు, కమల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి అనుమతి

ప్రజాశక్తి - క్యాంపస్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాల యం, పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్, తిరుపతిలో నిర్వహిస్తున్న డిప్లొమా కోర్సులో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల వెబ్ ఆప్షన్స్ నమోదు చేయడానికి ఆఖరు తేదీ ఈనెల 25 వరకూ పొడిగించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.సుమతి తెలిపారు.

BEFORE THE HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION-II ::: TIRUPATI
C.C.NO. 36 OF 2025
Between:
M. Neelima ...Complainant
And:
1. The Authorized Signatory, PURENERGY PVT. LIMITED, Sangareddy, Hyderabad, Telangana State-502 285.
2. The Authorized Signatory, Siri Chandana Automotives, Tirupati town, Tirupati Urban mandal, Tirupati district-517 501
...Opposite parties
NOTICE TO THE 2ND OPPOSITE PARTY
To
The Authorized Signatory, Siri Chandana Automotives, Tirupati town, Tirupati Urban mandal, Tirupati district-517 501
Sir,
Please take notice that the above complainant filed the above complaint against the 1st opposite party and also against you. The above complaint is stands posted to 25-07-2025 before the above said Hon'ble Commission for your appearance. If you fail to appear before the above said Hon'ble Commission on 25-07-2025 at 10-30 A.M, either in person or through your Advocate, an exparty orders will be passed against you and the above complaint will be decided in your absence.
Hearing date: 25-07-2025 at 10-30 AM
T. BHANUSUNDAR, M.B.A., LLB.,
Advocate for the complainant.

హరిహర వీరమల్లు విడుదల సంబరాలు

తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

జనసేన కిరణ్ రాయల్ ఆధ్వర్యంలో సినిమా ప్లకార్డుల ప్రదర్శన

ప్రజాశక్తి - తిరుపతి సిటి: జనసేన అధ్యక్షులు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా భారీ విజయం అందుకోవాలని జనసేన శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం ఉదయం మహాత్మజ్యోతిరావు పూలే సర్కిల్ నుంచి గ్రూప్ థియేటర్స్ వరకు బైక్ ర్యాలీ జరిగింది. తిరుపతి జనసేన ఇన్చార్జ్ కిరణ్ రాయల్ ఆధ్వర్యంలో సినిమా విడుదల ముందస్తు వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, బాణా సంచా కాల్చారు. ఈ సందర్భంగా కిరణ్ రాయల్ మాట్లాడుతూ సినిమాపై వైసీసీ సోషల్ మీడియా దుష్ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బాబ్జీ, సుభాషిణి, మనోజ్ తదితర పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు. చంద్రగిరి జనసేన పార్టీ ఇన్చార్జ్ దేవర మనోహర్ ఆధ్వర్యంలో మంగళవారం జనసేన పార్టీ కార్యాలయంలో హరి హర వీరమల్లు చిత్రం పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం కోటలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో చిత్రం విజయవంతం కావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి - పిచ్చాటూరు : స్విమ్స్ ఆధ్వర్యంలో నాగలాపురం, పిచ్చాటూరుల్లోని పిహెచ్‌సిల్లో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి, వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై చిత్రపటాల ద్వారా అవగాహన కల్పించారు. బిపి, షుగరు పరీక్షలతోపాటు పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. 24న నారాయణవనం, గుణపతిపాళెం, 25న ఏర్పేడు, పాపానాయుడుపేటల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాల్లో నాగలాపురం వైద్యాధికారులు డాక్టర్ విజయకుమార్, డాక్టర్ అరుణ్ కిషోర్, పిచ్చాటూరు వైద్యాధికారులు డాక్టర్ మునిచారిత్ర, డాక్టర్ ధనుష్, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ హరిత పాల్గొన్నారు.

రైతులకు పిఎండిఎస్ కిట్లు అందచేత

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ఏడి కార్యాలయం ఎదుట డిపిఎం షణ్ముఖం అడిషనల్ డీటీఎం పట్టాభిరెడ్డి డిస్టిక్ యాంకర్ రవిచంద్ర ప్రసాద్ చేతుల మీదుగా రైతులకు పిడిఎస్ కిట్లు అందచేశారు. ఒక ఎకరాకు 12 కేజీలు చొప్పున, 18 రకాల విత్తనాలను అందచేశారు. డిపిఎం షణ్ముఖం మాట్లాడుతూ వేసవికాలంలో రైతులకు అదనపు ఆదాయంతోపాటు పశువులకు మేతగా ఉపయోగపడుతుందన్నారు. భూమికి ప్రకృతి వ్యవసాయ ఆహార పంటల వల్ల ప్రజలకు ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. కలుపు నివారించబడి, భూమి సారవంతమవుతుందని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఏ.డి.గోపి నాయక్, ఏపీఎం బుజ్జమ్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండిగ మండలం, కనమనంబేడు ఏకలవ్య గురుకుల పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మురళీధర్ రెడ్డి, ఆరోగ్య అధికారి డిఎన్ వెంక టేశులు ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు సీజనల్ వ్యాధులపట్ల అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియచేశారు.

ముగిసిన శ్రీ కోదండరామస్వామి ఆలయ పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి – తిరుపతి సిటి : తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి ఆలయ పవిత్రోత్సవాలు మంగళవారం రాత్రి పూర్ణాహుతితో ముగిశాయి. ముందుగా స్వామివారిని ఉదయం సుప్రభాతంతో మేల్కొలిపి తోమాల సేవ, సహస్రనామార్చన నిర్వహించారు. ఉదయం యాగశాలలో వైదిక కార్యక్రమాలు జరిగాయి. అనంతరం ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం వైభవంగా జరిగింది. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో విశేషంగా అభిషేకం చేశారు.

బుద్ధుని విగ్రహం ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలి

తిరుపతి జిల్లా అడిషనల్ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ రవి మనోహరాచారికి దళిత నాయకుల వినతి పత్రం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : అన్నమయ్య జిల్లా, మదనపల్లిలో బుద్ధుని విగ్రహాన్ని ధ్వసం చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంగళవారం దళిత నాయకులు తిరుపతి జిల్లా అడిషనల్ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ రవి మనోహరాచారికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంతవరకు దోషులను అరెస్ట్ చేయకపోవడం దారుణమన్నారు. త్వరలో తిరుపతికి రానున్న సీఎం చంద్రబాబుకు కూడా వినతి పత్రం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పరమశివం , అంజయ్య , డాక్టర్ గోపి , డాక్టర్ మేడికొండ ప్రసాద్ రావు, రమేష్, నాగయ్య, రామ్మూర్తి, ప్రొఫెసర్ మల్లికార్జున రెడ్డి, గిరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ద్రౌపది మాత కల్యాణం

ప్రజాశక్తి - రామచంద్రాపురం: రామచంద్రాపురం మండలం, సి రామాపురంలో నిర్వహిస్తున్న మహా భారత ఉత్సవాలలో మంగళవారం వైభవంగా శ్రీ ద్రౌపతి మాత కల్యాణం నిర్వహించారు. సి రామాపురానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ కొట్టే తేజోవతి, నరసింహా రెడ్డి కుటుంబ సభ్యులు అమ్మ వారి కళ్యాణ మహోత్సవానికి ఉభయ దారులుగా వ్యవహరించారు. ఉభయ దారుల ఇంటి నుంచి అమ్మవారికి సారె తీసుకొని వచ్చారు.ద్రౌపది అమ్మవారితో సహా పంచ పాండవులకు నూతన పట్టు వస్త్రాలను అలంకరించి వేయించేపుగా ఆలయ ప్రదక్షిణ చేసి కళ్యాణ వేదిక వద్దకు తీసుకొని వచ్చారు. శాస్త్రోక్తంగా అర్చకులు వేదమంత్రాలను చదువుతూ ద్రౌపతి అమ్మవారి కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.

పూర్ణాహుతితో ముగిసిన లక్ష్మీ కుబేర హోమం

ప్రజాశక్తి - రామచంద్రాపురం: ప్రపంచ శాంతి, లోకకళ్యాణార్థం కోసం బ్రహ్మర్షి గురూజీ ఆశ్రమంలో నిర్వహించిన లక్ష్మీ కుబేర హోమం పూర్ణాహుతితో ముగిసింది. మంగళవారం మహారాష్ట్రకు చెందిన జగద్గురు స్వామి శాంతి గిరిజానా ప్రభువు గణపతి పూజ, నవగ్రహ పూజ, పుణ్యాహవచన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీ కుబేర ఉత్సవ విగ్రహానికి అభిషేకాలను నిర్వహించి విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జగద్గురు స్వామి రాయల చెరువు కట్ట కింద ఉన్న శ్రీ జలకంఠేశ్వర స్వామి, ఆంజనేయస్వామి, కామాక్షి సమేత కోటిలింగేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుండి భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, త్యాగరాజ వీధిలో ఉన్న శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి దేవస్థానంలో మంగళవారం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించి అన్నప్రసాదాలు స్వీకరించారు.

మెరుగైన తపాలా సేవలే లక్ష్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్: ఐటి టు పాయింట్ ఓ రోల్ అవుట్ లో భాగంగా మంగళవారం గూడూరు తపాలా డివిజన్ బదిలీ అయింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గూడూరు డివిజన్ సూపరిడెంట్ ఎల్.వి.మురళీ కుమార్ మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించే దిశగా తపాలా శాఖ ముందుకెళుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎస్పీ మణిగంధన్, పోస్టుమాస్టర్ షేక్ నజీముద్దీన్, ఐపి సుధీర్ బాబు, కిరణ్ కుమార్ నాయక్, సురేష్, ఫైరోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీ రూ. 307 ఇవ్వాలి

ప్రజాశక్తి - తొట్టంబేడు: ఉపాధి కూలీలకు రోజుకు 307 రూపాయలు తగ్గకుండా కూలి వచ్చే విధంగా పని కల్పించాలని పి.డి శ్రీనివాస ప్రసాద్ అధికారును ఆదేశించారు. మండలంలోని సాంబయ్యపాలెం పంచాయతీలో మంగళవారం ఆయన ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పని కావాలని అడిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలన్నారు. కూలీలతో మాట్లాడుతూ 100 రోజుల పని సక్రమంగా చేసుకుంటే మొత్తం సంవత్సరానికి 30 వేల రూపాయలకు పైగా ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండలం ఏ.పీ.వో కల్పన, టి.ఏ లు పాల్గొన్నారు.

లోకల్ క్రైసిస్ గ్రూప్ సమావేశం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా సూచనల మేరకు ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో కలర్ షైన్ గ్రూప్ వారు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అత్యవసర పరిస్థితిల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి సబ్ కలెక్టర్, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వారు వివరించారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎంపిడిఓ మధుసూదన్ రావు, గూడూరు అగ్నిమాపక శాఖ సిబ్బంది, చెన్నూరు ప్రైమరీ హెల్త్ సెంటర్, కలర్ షైన్ ప్రతినిధులు డి.పి.సింగ్, జయశ్రీ, సునీల్ రెడ్డి, లోకేష్, విజయ్ కుమార్, సోషల్ వర్కర్స్, మీడియా ప్రతినిధులు పాల్గొనారు.